క్లుప్తంగా

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో బుధవారం డ్రైనేజీ పైపులైను పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సాధారణ నిధులు రూ.5లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, నర్సింలుగౌడ్, సోమ్లునాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, జనార్ధన్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న పరిశ్రమ యాజమాన్యం

షాద్‌నగర్: దాతల సహాయంలో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కొత్తూరు మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో ఉన్న బింజుసారియా ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వారు రూ.11లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా పరిశ్రమ సిబ్బంది వినోద్‌కుమార్ కేడియా తన తండ్రి భన్వరీలాల్ కేడియా జ్ఞాపకార్థం విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది మోముల బసప్ప, పరిశ్రమ యజమాని హితేశ్ కేడియా తదితరులు పాల్గొన్నారు.

బీసీ సేన గ్రామ కమిటీల ఏర్పాటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరసముద్రం, లచ్చంపేట గ్రామాల్లో బుధవారం బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరసముద్రం గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా జానంపేట యాదమ్మ, ఉపాధ్యక్షురాలిగా పి.యాదమ్మ, ప్రధాన కార్యదర్శిగా కవిత, కార్యదర్శిగా టి.యాదమ్మ, కోశాధికారిగా మంజుల ఎన్నికయ్యారు. లచ్చంపేట గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలిగా బిపాషా, ప్రధాన కార్యదర్శిగా మనీల, కోశాధికారిగా వీరమణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పస్పుల ప్రశాంత్, నాయకులు జూపల్లి చంద్రశేఖర్, వెంకటేశ్, బాల్‌రాజ్, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు విరాళం



గ్రామస్తులకు నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ లింగం

షాబాద్: మండలంలోని నాన్‌ధార్‌ఖాన్‌పేట్‌లో ఈ నెల 19వ తేదీన నిర్వహించే బొడ్రాయి, మైసమ్మ ఉత్సవాలకు రావాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం దామర్లపల్లి మాజీ సర్పంచ్ బొకుల లింగంను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఉత్సవాల నిర్వహణకు రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, నాయ కులు కృష్ణ, దయాకర్ చారి, సురేష్, వినోద్, విశ్వనాథం,కృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

మొయినాబాద్ రూరల్: మున్సిపల్, మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి తదితర గ్రామాల్లో సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో హిమాయత్‌నగర్ విద్యాజ్యోతి చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, ఉడిపి హోటల్ ఎదుట వర్షం నీరు నిలిచింది. వర్షం నీరు రోడ్లపై నిలువకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



అంతిరెడ్డిగూడ శివారులో బోర్డు ఏర్పాటు చేయని పరిశ్రమ



నందిగామ శివారులోని ఓ పరిశ్రమ వద్ద గోడకు తగిలించిన చిన్న బోర్డు

బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం

- నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- గుట్టుచప్పుడు కాకుండా ఉత్పత్తుల తయారీ
- చోద్యం చూస్తున్న అధికారులు

నందిగామ: రూ.కోట్లు టర్నోవర్ చేసే భారీ పరిశ్రమలు ఒకవైపు.. అనుదినం టన్నుల కొద్ది ఐరన్ ఉత్పత్తులు చేసేవి మరోవైపు.. ప్లైవుడ్, ఫార్మా, అల్యూమినియం, మసాల దినుసులు, సిలిండర్, టెక్స్‌టైల్ ఇలా అనేక పరిశ్రమలకు నెలవైన మండలంలోని పలు కంపెనీల యజమానులు కొందరు తమ పరిశ్రమకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పారిశ్రామికవేత్తలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

పైన పటాలం.. లోన లొటారం..

పరిశ్రమలో ఏమి ఉత్పత్తులు తయారవుతున్నాయో పరిసర ప్రాంతాలకు ఏమాత్రం తెలియడం లేదు. పరిశ్రమ పేరు కూడా స్థానికులకు తెలియడం లేదంటే యజమానుల తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిశ్రమకు చుట్టూ ప్రహరీ నిర్మించుకొని వాచ్ మెన్‌లను పెట్టుకొని అందులో ఏ ఉత్పత్తులు తయారవుతున్నాయో తెలియకుండా యాజమాన్యాలు జాగ్రత్త పడటంలో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. వారు తీసుకున్న అనుమతుల మేరకు ఉత్పత్తులు తయారవుతున్నాయా లేక చట్టవ్యతిరేక, అనుమతులు లేని ఉత్పత్తులా అనే విషయం ఏ మాత్రం తెలియడం లేదు. ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించాల్సిన యాజమాన్యాలు తనిఖీలు చేసే అధికారులకు ముడుపులతో సంతృప్తి పర్చడంతో వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. మండలంలోని నందిగామ, అంతిరెడ్డిగూడ, మేకగూడ, వీర్లపల్లి, నర్సప్పగూడ, చేగూరు, చాకలిగుట్టతండా తదితర గ్రామాల్లో నెలకొన్న అధిక శాతం పరిశ్రమల తీరు ఈ విధంగానే ఉంది. దీంతో పరిశ్రమలోపల ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

నిబంధనలు ఇలా..

ఓ పరిశ్రమను ఏర్పాటు చేయాలంటే మొదటగా చేసే పని పరిశ్రమ పేరు రిజిస్టర్ చేయడం. పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలంలో కంపెనీ యాక్ట్ ప్రకారం నిర్ణీత సైజు ప్రకారం పరిశ్రమ పేరు, ఉత్పత్తులు, సర్వే నం, పరిశ్రమ హెడ్ ఆఫీస్ చిరునామా, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి పేరు, ఫోన్ నంబరు, కార్యాలయ చిరునామా, ఒక వేళ ఎవరైనా వ్యక్తులు ఫిర్యాదు చేయాల్సి వస్తే ఏ అధికారికి, ఏ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలో వారి పేర్లు, ఫోన్ నంబర్లు కూడా బోర్డుపై నమోదు చేయాల్సి ఉంది. సంబంధిత పూర్తి వివరాలతో కూడిన బోర్డులను పరిశ్రమ వెలుపల బహిరంగంగా అందరికీ కనపడేలా బోర్డులను ఏర్పాటు చేయాలి.

బోర్డుల ఏర్పాటుపై భయం ఎందుకు?

ప్రభుత్వ అనుమతుల మేరకు పరిశ్రమను స్థాపించి, తీసుకున్న అనుమతుల మేరకు ఉత్పత్తులు చేపట్టి, దానికి సరిపడా రశీదులు, పన్నులు చెల్లించి, నియమ నిబంధలు పాటించినట్లయితే పరిశ్రమల యాజమాన్యాలు బోర్డులను నిర్భయంగా పెట్టుకుంటాయి. కానీ ఇక్కడ స్థాపించిన చాలా కంపెనీల్లో యాజమాన్యాలు బోర్డులను ఏర్పాటు చేయకపోవడం చూస్తే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

నిరంతరం పరిశ్రమలను తనిఖీ చేసే అధికారులకు పరిశ్రమల బోర్డులు కనపడటం లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అటు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు గానీ, ఇటు కార్మికశాఖ అధికారులు గానీ ఇప్పటివరకు ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పరిశ్రమలపై నిరంతరం నిఘా పెట్టాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కంపెనీల్లో నిబంధనల ప్రకారం బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మచ్చుకు కొన్ని..

- మండల కేంద్రమైన నందిగామ శివారులోని పాత జాతీయ రహదారిపై ఉన్న ఓ ఐరన్ పరిశ్రమలో అనుమతులు లేకుండా ఇతర కంపెనీకి చెందిన బ్రాండ్‌లను అక్రమంగా వినియోగిస్తూ ఉత్పత్తులను చేపడుతున్న విషయమై గతంలో ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.
- అయ్యప్పస్వామి దేవాలయానికి అతి సమీపంలో ఉన్న ఓ పరిశ్రమలో అక్రమంగా గుట్కా, పొగాకు ఉత్పత్తులను చేపడుతుండగా గతంలో ఎస్‌ఓటీ పోలీసులు పెద్ద ఎత్తున గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- పృథ్వీకాలనీకి వెళ్లే దారిలో ఓ మూతపడిన పరిశ్రమలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు.
- మేకగూడ శివారులోని ఓ ప్లైవుడ్ పరిశ్రమలో వేల సంఖ్యలో వ్యవసాయానికి వినియోగించే యూరియా బస్తాలను పోలీసులు పట్టుకున్నారు.

చర్యలు తీసుకోవాలి



నందిగామ, కొత్తూరు ప్రాంతాలలో వెలసిన పరిశ్రమలలో చాలా మంది పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమలకు బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సైతం ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో పరిశ్రమలలో ఏం జరుగుతుందో బయటి ప్రపంచానికి తెలియడం లేదు. ఎలాంటి అక్రమాలు, చట్టవ్యతిరేక ఉత్పత్తులు జరగకపోతే బహిరంగంగా బోర్డులను ఎందుకు ఏర్పాటు చేయరు. అధికారులు స్పందించి పరిశ్రమల బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బీన సాయిబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

నోటీసులు జారీ చేస్తాం

పరిశ్రమల యజమానులు బోర్డులు ఏర్పాటు చేయనట్లయితే గ్రామ పంచాయతీలు సైతం వాటికి నోటీసులు జారీ చేయాలి. ఆ దిశగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తాం. అదేవిధంగా అధికారులు సైతం చర్యలు తీసుకోవాలి.

–తేజ్‌సింగ్, ఎంపీఓ, నందిగామ

పంట మార్పిడితో అధిక లాభాలు

శాస్త్రవేత్త డాక్టర్ చిరంజీవి



పంట మార్పిడిపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

మొయినాబాద్‌రూరల్: రైతులు పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చిరంజీవి, ఆలీబాబా అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నమంగళారంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువవుతాయని, రోగకారక పురుగుల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గుతుందని తెలిపారు. వరుసగా ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటల సాగుతో పురుగుల జీవిత చక్రాన్ని నిలిపివేయొచ్చని వివరించారు. దీంతో పంటల్లో మంచి లాభాలను పొందగలుగుతారని, రైతులు ఒకే రకమైన పంటల సాగుకు పూర్తిగా స్వస్తి చెప్పి పంటల మార్పిడి విధానానికి శ్రీకారం చుట్టాలన్నారు. పంట మార్పిడి ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయ ప్రయోజనాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యానవన అధికారి ఆయిల్‌పామ్ సాగు పద్ధతులు, సంబంధిత రాయితీల వివరాలు తెలిపారు. పంట మార్పిడిపై కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌బాబు, ఉద్యానవన అధికారి కీర్తికృష్ణ, ఏఈఓ సునీల్, గ్రామస్తులు రాములు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం

సిక్కిం రాష్ట్ర బీజేపీ పరిశీలకుడు పాపన్నగౌడ్



సత్యహరిశ్చంద్రుడి పాత్రలో కళాకారుడు

షాద్‌నగర్‌రూరల్: ప్రాచీన కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిక్కిం రాష్ట్ర బీజేపీ పరిశీలకుడు పాపన్నగౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరంలో గల ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి రంగక్షేత్ర హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో పాలమూరు వారి నిర్వహణలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ సంయుక్త సౌజన్యంతో 'సత్యహరిశ్చంద్రీయం' అనే పౌరాణిక, పద్య నాటక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ మాట్లాడుతూ.. ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల మానసిక వికాసానికి, వినోదానికి కళా ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం నాటక, పద్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, జేఎస్వీ.శివప్రసాద్, ద్రోణాచారి, యాదగిరిచారి, కృష్ణ, వీరమణి, పురుషోత్తమచారి, సంజీవరావు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

షాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్ ఒలెక్ట్రాక్ బస్సుల కంపెనీ ఎదుట కార్మికులతో కలిసి ఆయన ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందన్నారు. దీని ఫలితంగా కార్మికులు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయి బానిసత్వంలోకి నెట్టివేయబడతారని ఆరోపించారు. మండలంలో ఉన్న కంపెనీల కార్మికులు పెద్దసంఖ్యలో సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తమ హక్కులను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ నర్సింహ, ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ కార్మికులు, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే కాలె యాదయ్య



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టల్ వెంచర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన దేవాలయంలో హనుమాన్, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు, నవగ్రహాల ప్రతిష్టాపనోత్సవానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పాపారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

మహిళలు స్వశక్తితో ఎదిగి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆకాంక్షించారు. బుధవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అదేవిధంగా వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ మల్లేశ్వరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి మోహన్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రఘునందన్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1990–92లో ఇంటర్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారందరూ ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనందంగా గడిపారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, జూపల్లి చంద్రశేఖర్, ఆశీర్వాదం, హరీశ్వర్, ముకుందర్‌రెడ్డి, శ్రీనివాస్, బండ శ్రీనివాస్, రాజేందర్, బాస వరలక్ష్మి, మాధవిలత, కొట్టె ప్రసన్న, శ్రీలత, అరుణ, వసుధ, స్వర్ణలత, గడ్డం మాధవి, సుజాత, రామలక్ష్మి, మంజు, మాధవి, ప్రభావతి, జ్యోతి, రేఖ, వనజ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య



ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న నాయకులు

కొందుర్గు: కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. హక్కుల సాధన కోసం ఈ నెల 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మె నోటీసును బుధవారం గ్రామ పంచాయతీ కార్మికుల తరఫున జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. వంద ఏళ్లుగా ఉన్న కార్మిక చట్టాలను బీజేపీ హరిస్తూ కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం కోసం ఈ నెల 20న సమ్మె చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు పాపయ్య, నాయకులు చంద్రమ్మ, రాములమ్మ, జంగయ్య, రమేశ్, ఈదమ్మ పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



షాద్‌నగర్ రూరల్: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 380 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి కింద సుమారు రూ.3 కోట్ల 80 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, మల్లేశ్, ఇబ్రహీం, ముబారక్, తహసీల్దార్ పార్థసారధి పాల్గొన్నారు.

శ్రీరాముడి మార్గం అనుసరణీయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ శ్రీరాముడు చూపిన మార్గంలో నడుచుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన శివమారుతీ రామాలయంలో బుధవారం గణపతి, శ్రీరామచంద్రమూర్తి, అభయాంజనేయస్వామి, కాశీవిశ్వేశ్వర నందీశ్వర, నవగ్రహ, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మురళీకృష్ణయాదవ్, నరేందర్, ఈట గణేష్, ఎంఎస్.నటరాజ్, బీజేపీ నేతలు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరామచంద్రమూర్తి నీతి, నిజాయితీతో ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా ధర్మపాలన చేశారని, మీరందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. స్వార్థ ప్రయోజనాలు, భేషజాలకు పోకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకొని సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అతిథులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ప్రభాకర్, శేఖర్, అశోక్, అంజియాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు

షాబాద్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైనా 31 ఇందిరమ్మ ఇళ్లకు కొలతలు చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.



పోతుగల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేస్తున్న నాయకులు తదితరులు